✥•✥•✥ 54 ✥•✥•✥

# ఆలస్యమైన అద్భుతము

*“యేసు మరల బిగ్గరగా కేక వేసి ప్రాణము విడిచెను. అప్పుడు దేవాలయపు తెర పైనుండి క్రింది వరకు రెండుగా చినిగెను; భూమి వణకెను; బండలు బద్దలాయెను; సమాధులు*

*తెరవబడెను, నిద్రించిన అనేక మంది పరిశుద్ధుల శరీరములు లేచెను. వారు సమాధులలో నుండి బయటికి వచ్చి ఆయన లేచిన తరువాత పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు అగపడిరి" (మత్తయి 27:50-53).*

మన ప్రభువు మరణించిన వెనువెంటనే సంభవించిన అద్భుతకరమైన ఆనవాళ్లు యేసు బలియాగము ప్రామాణికమైనదనుటకు దైవీకమైన సాక్షాత్ సమర్థవంతమైన నిశ్చయములుగా చిరకాలము నిలిచియుంటాయి. యుగములన్నిటిలోని అతి గొప్ప సంఘటన - దేవాలయపు తెర చినుగుట, భూమి వణకుట, మరియు సమాధులు తెరవబడుట ద్వారా దేవుడు మనకు ఆయన సాక్ష్యాన్నిచ్చాడు. ఈ సంకేతములు "యేసు మరల బిగ్గరగా కేకవేసి ప్రాణము విడిచిన" వెనువెంటనే ఒకటి తరువాత మరొకటి వరసగా సంభవించాయి (మత్తయి 27:50). యేసు సిలువమరణము నొందుటలో గల దైవికమైన స్వభావమును నిర్ధారించుటకు అవి ఇవ్వబడినవని ఈ అద్భుతములు సంభవిల్లిన సమయము ధ్రువీకరించుచున్నది.

మూడవ సూచనలో నుండి నాల్గవ సూచన ఒకటి బయలుపర్చబడుచున్నది – పరిశుద్ధుల పునరుత్థానము. దేవుడు దీనిని ఒక విధంగా ఒక ఆలస్యమైన అద్భుతంగా జరిగించాడు. ఇది యేసు మరణించిన కొన్ని నిమిషముల తరువాత జరిగింది, కానీ ఆదివారంనాడు యేసు మృతులలో నుండి పునరుత్థానుడగునంత వరకు పూర్తి కాలేదు. "సమాధులు తెరవబడెను, నిద్రించిన అనేక మంది పరిశుద్ధుల *శరీరములు* లేచెను; వారు సమాధులలోనుండి బయటికి వచ్చి ఆయన లేచిన తరువాత పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు అగపడిరి" అని మత్తయి వ్రాయుచున్నాడు (మత్తయి 27:52, 53; నొక్కి చెప్పింది నాది).

అలాగైతే, మనము ఈ అద్భుతమును ఏమని అర్థంచేసికోవాలి? దీని నుండి ఏ యే పాఠములను మనము సేకరింపవచ్చును?

*మొట్టమొదటిదిగా, మృతుల శరీరములపై దేవునికి గల అధికారమును ఈ పునరుత్థానములు చూపించుచున్నవి.* "సమాధులు తెరవబడెను, నిద్రించిన అనేక మంది పరిశుద్ధుల శరీరములు లేచెను" అని మత్తయి వ్రాయుచున్నాడు (మత్తయి 27:52).

దేవుడు మృతులైనవారిని లేపినాడను సత్యము అత్యంత ఆకర్షణీయమైన బైబిల్ సత్యములలో ఒకటై యున్నది. మృతులైన ముగ్గురు మరలా లేపబడినట్లు పాత నిబంధనలోను, ఐదుగురు మృతులు తిరిగి లేపబడినట్లు క్రొత్త నిబంధనలోను చూడవచ్చును. హేతు శక్తికి అంతుపట్టని ఈ అద్భుత కార్యములు దేవుని వాస్తవమైన చర్యలై యున్నవి. అవి ఎల్లప్పుడును దేవుని చిత్తము మరియు వాక్యము ప్రకారమైనవై యుండినవి. అవి ఇతర విషయములతోపాటు, దేవుడు జీవముపై మాత్రమే కాదు గాని, మరణముపై కూడా అధికారము కలిగియున్నాడని ఉదాహరణంగా మనకు విశదపర్చుచున్నవి. ఆయన మన శరీరములకు జీవమునిస్తాడు, ఇచ్చిన జీవమును మన శరీరములలో నుండి మరలా తీసికొంటాడు, మరియు ఆయన అనుకుంటే, తీసికొన్న జీవమును మరలా మన శరీరములకు తిరిగి ఇయ్యగలడు. యోబు, అతనికి కలిగిన గొప్ప నష్టము కష్టము నడుమ, "నేను నా తల్లి గర్భములో నుండి దిగంబరినై వచ్చితిని, దిగంబరినై అక్కడికి తిరిగి వెళ్లెదను. యెహోవా ఇచ్చెను యెహోవా తీసికొని పోయెను. యెహోవా నామమునకు స్తుతి కలుగునుగాక" అని పలికాడు (యోబు 1:21).

*దేవుడు, సాక్ష్యములను సాక్షాత్కరించు దేవుడై యున్నాడని ఈ పునరుత్థానముల చేత మనము సరిక్రొత్తగా గుర్తుచేయబడుచున్నాము.* యేసు యొక్క ఇహలోక పరిచర్యయందంతటను, యేసు జీవితము ద్వారా ఆయన ఏమి చేయుచుండెనో అద్భుతకరమైన సూచనలతో దేవుడు మనకు రూఢిపర్చాడు. దేవుడు లోక రక్షణార్థమై రచించుకొన్న తన సంకల్పములతోను ప్రణాళికలతోను కలువరి గిరిపై సిలువచెంత ఉండినాడని ప్రత్యేకమైన ఈ లోకాతీత సంఘటన ప్రకటించింది. యేసు మన నిమిత్తము పాపమైనప్పుడు ఆయన యేసునకు దూరమయ్యాడు, కానీ జరిగిన మరియు జరుగుచుండిన విషయముల గూర్చి అంధకారము అలుముకొనుట, తెర చినుగుట, భూమివణకుట, మరియు సమాధులు తెరవబడుట ద్వారా ఆయన తన ఆమోదమును తెలియజేయు అంగీకారమును తెలియజేశాడు.

ఒకరు మూలాధారమును, బయలుపరచబడుచున్న తన వాక్యము యొక్క నిజాయితీని అంగీకరించినట్లయితే, దేవుడు ఈ సూచనల ద్వారా లోకముతో మాటలాడుచుండెనను వాస్తవమును అతడు అంగీకరించవలసి యుండును. నేను నా యొద్ద నున్న ఆకాశవాణిని తెరచినప్పుడు, "నేనిప్పుడు మిల్‌సాప్‌లో ఉన్నాను. గత రాత్రి మేము మరణించిన ఒకాయనను మరలా బ్రతికించాము. అతడు గత ఐదు సంవత్సరాలుగా మృతుడై యుండినాడు, కానీ మేము అతన్ని మరలా బ్రతికించాము" అని బోధకుడొకరు బోధించుట నాకు వినబడిందనుకొనండి. అప్పుడు నేనేంచేస్తానో తెలుసా? వెంటనే దానిని ఆపివేస్తాను. దాని మూలాధారమును నేను నమ్మను గనుక అలా జరిగిందని నాకు నమ్మకం కలుగదు ఆ బోధకుడెవరో కానీ ఆయన భ్రమపడ్డాడు, అపార్థం చేసికొన్నాడు, లేదా తప్పుదోవ పట్టించబడ్డాడు. ఏదిఏమైనా, యేసు మరణించిన కొద్దిసేపట్లోనే శరీరములు లేపబడినవని దేవుని వాక్యము నాతో చెప్పినప్పుడు, అసత్యమని నిరూపింపబడజాలని ఈ నిదర్శనమును ఇచ్చినందుకు నేను దేవుని కృతజ్ఞతతో స్తుతిస్తాను. నివేదికలో చెప్పబడినది జరిగినదని నేనెరుగుదును. ప్రపంచములో బైబిలొక్కటే ఆములాగ్రముగా నూటికి నూరు పాళ్లు సరియైన గ్రంథమై యున్నది. శరీరములు లేపబడినవని అది చెప్పుచున్నట్లయితే నేను ఎటువంటి ఎదురు ప్రశ్ననైనను వేయక ఆ విషయమును నమ్ముదును. అంతే!

నిద్రించిన వారిలో క్రీస్తు ప్రథమ ఫలమై యున్నాడని ఈ పునరుత్థానములు స్పష్టంగా తెలియజేయుచున్నవి. యేసు పునరుత్థానము సర్వోత్కృష్టమైనదని ఈ వాస్తవము కళ్లకద్దినట్లు ఉదాహరణంగా చిత్రీకరించుచున్నది. మనమేమీ చేయలేము కానీ మత్తయి వ్రాసిన మాటలను గమనంచగలము, "వారు సమాధులలోనుండి బయటికి వచ్చి *ఆయన లేచిన తరువాత* పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు అగపడిరి" (మత్తయి 27:53; నొక్కి చెప్పింది నాది).

ఈ శక్తివంతమైన సోదాహరణము గడిచిన కొన్ని సంవత్సరముల తరువాత, మృతులలో నుండి లేచినవారిలో క్రీస్తు ప్రథమఫలమై యుండెననియు ప్రథమ ఫలమై యున్నాడనియు పౌలు రచించాడు: "ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడు" (1 కొరింథీయులకు 15:20).

యేసు పునరుత్థానమునకు మునుపు ఇతరులు కూడ మృతులలో నుండి లేచారు. వీటిలో ఆరింటిని పేర్కొనవచ్చును: సారెపతు విధవరాలి కుమారుడు (1 రాజులు 17:17-24),

షూనేమీయురాలి కుమారుడు (2 రాజులు 4:8–37), వాని భౌతిక శల్యములు ఎలీషా శల్యములకు తగిలినప్పుడు లేపబడినవాడు (2 రాజులు 13:20, 21), నాయీను విధవరాలి కుమారుడు (లూకా 7:11–15), యాయీరు కుమార్తె (మత్తయి 9:18–25), మరియు లాజరు (యోహాను 11:1–44). ఇవన్నీ కూడ మన ప్రభువు యొక్క పునరుత్థానమునకు భిన్నమైనవై యున్నవి. యేసు యిక ఎన్నటికినీ మృతిచెందకుండా ఉండునట్లు మృతులలో నుండి లేచాడని పౌలు చెప్పుచున్నాడు: "మృతులలో నుండి లేచిన క్రీస్తు ఇకను చనిపోడనియు, మరణమునకు ఇకను ఆయనమీద ప్రభుత్వము లేదనియు ఎరిగి ..." అని చెప్పుచున్నాడు (రోమీయులకు 6:8–9). ఆయన మరణమునకు మునుపు మరణించినవారు కేవలము మరలా బ్రతికింపబడిరి గనుక మరలా మరణిస్తారు. సంభావ్యంగా, యేసు పునరుత్థానుడైన వెంటనే లేపబడినవారు, పట్టణములో కొందరికి అగుపడిన తరువాత, ఆకాశములోనికి కొనిపోబడి యుందురు. వీరి పునరుత్థానములు యేసు పునరుత్థానము వంటివై యుండినవి.

జే. డబ్ల్యు మెక్‌గార్వే ఇలా వ్రాస్తున్నాడు:

> లేపబడిన ఈ పరిశుద్ధులకు ఏమి జరిగియుండవచ్చునో యని ఎన్నో ఊహాగానాలుండినవి. నిశ్చయాత్మకమైన సమాచారము మనకేదియును లేదు, కానీ సహజంగా అనుకొనబడుచున్నదేమంటే, వారు పరలోకమునకు ఆరోహణమై వెళ్లారు. ఈ పునరుత్థానములు, క్రీస్తు పునరుత్థానము మానవజాతి పునరుత్థానమై యున్నదని చూపించుచు, సాంకేతిక సంకేతములై యుండినవి.[1]

మన పితరుల యుగములో ఒక పరిశుద్ధుడు – పరమునకు కొనిపోబడినాడు; మోషే యుగములో మరొకరు – ఏలీయా – కొనిపోబడినాడు; మరియు కొందరు పరిశుద్ధులు యేసు పునరుత్థానము తరువాత పరమునకు చేర్చుకొనబడిరి.

*యేసు మరణము మనలను మరణము నుండే రక్షించునని ఈ పునరుత్థానములు నలుదిశల ప్రచురము చేయుచున్నట్లు మనము చూడగలము.* దేవుడు ఈ విధమైన నిదర్శనమును ఎందుకు ఎన్నుకొన్నట్టు? ఒక్క పిడుగు వచ్చి సిలువపై పడునట్లు చేయవచ్చునుకాదా, ఆయన ఎందుకలా చేయలేదు? యేసును సిలువవేయుటలో పాల్గొనిన వారందరిని ఆయన మరణముతో ఎందుకు మొత్తలేదు? ఆయన అలా చేయకపోడానికి ఖచ్చితంగా ఆయనకు సహజాతీతమైనది మాత్రమే కాదు, గాని క్రీస్తు మరణము యొక్క దైవీకమైన అధికారము మరియు స్వభావము గూర్చి విజ్ఞానపూరితమును ఉపదేశాత్మకమునైన ఒక సంకేతము సహితము అవసరమైయుండినదన్నదే హేతువైయుంటుంది.

పునరుత్థానముల ఈ సూచన నాలుగు గొప్పవియు అసాధరణమునైన లక్షణములు కలిగియున్నది: మొదటిది, సమాధులు తెరవబడుట. రెండవది, సమాధులలో నిద్రించియుండినవారు ఆదివారం ఉదయం వరకు లేపబడకుండా ఉండుట. మూడవది, పునరుత్థానములలో జీవాత్మలు శరీరములతో కలిసిపోవుట. నాల్గవది, యెరూషలేములో నివసించుచుండినవారికి అనేకులకు అగపడుట ద్వారా పునరుత్థానములను ధ్రువీకరించుట, పరిశుద్ధులు దేవుని సన్నిధిలోనికి ఆరోహణమయ్యారను ఆలోచన ఐదవ లక్షణమై యుండుట కూడా సాధ్యమే. మన ప్రభువు మనలను మరణము నుండి విడిపించు విధానము గూర్చి ఇంత కంటే యింకా కళ్లకద్దినట్లుగా ఉండగల చిత్రీకరణ మరొకటి ఉండగలదా?

"పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు" అని యేసు లాజరు సమాధి యొద్ద మరియతో చెప్పాడు (యోహాను 11:25, 26ఎ), మన శరీరముల పునరుత్థానము గూర్చి 1 కొరింథీయులకు 15వ అధ్యాయంలో ఆయన సవివరంగా చర్చించిన తరువాత, పౌలు మహత్తరమైన ఈ అధ్యాయాన్ని అమర్త్యమైన ఈ పదములతో ముగించాడు: " 'ఓ మరణమా, నీ విజయమెక్కడ? ఓ మరణమా, నీ ముల్లెక్కడ?' మరణపు ముల్లు పాపము; పాపమునకున్న బలము ధర్మశాస్త్రమే; అయినను మన ప్రభువైన యేసు క్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగునుగాక" (1 కొరింథీయులకు 15:55-57). మరలా, రోమీయులకు వ్రాసిన పత్రికలో పౌలు ఇలా వ్రాస్తున్నాడు, "అంతేకాదు, ఆత్మయొక్క ప్రథమ ఫలములనొందిన మనము కూడ దత్తపుత్రత్వము కొరకు, అనగా మన దేహము యొక్క విమోచనముకొరకు కనిపెట్టుచు మనలో మనము మూలుగుచున్నాము" (రోమీయులకు 8:23).

యేసు పునరుత్థానము తరువాత పరిశుద్ధులను లేపుట బైబిలులో గల ఒక అత్యంత ఆశ్చర్యకరమైన అద్భుతమై యున్నదని మనము చెప్పవచ్చును. దానిలో విశిష్ఠతకు సంబంధించిన అన్ని అంశములూ ఉన్నాయి. నిద్రించుచున్నవారిలో యేసు ప్రథమ ఫలమై యున్నాడను సత్యమును అది ఉద్ఘాటించి చెప్పుచున్నది; దేవుని సాక్షాత్కర స్వభావమును అది బయలుపర్చుచున్నది; దేవుడు మృతిచెందిన మన శరీరములపై అధికారము కలిగియున్నాడని అది చెప్పుచున్నది; మరియు, అది ఉపదేశించుచున్న అతి గొప్ప దేశములలో, యేసు మరణము ద్వారా మన శరీరములు మరియు జీవాత్మలు మరణము నుండి విమోచింపబడునని అది చాటిచెప్పుచున్నది.

❖◆❖◆❖

*"ఒకరు పరిశుద్ధుల శరీరములను లేపుట అను అంశమును చర్చించునప్పుడు, ... శుద్ధమైన లోకాతీతవాదము చేత స్పష్టమైన జోక్యము కలిగియుండు విషయమును ఆయన ఎదుర్కొంటాడు. ఏ శక్తి వలననైనను లేదా ఏ సాధనోపాయము ద్వారానైనను ... జీవమును సృష్టించగల మార్గము మానవునికి తెలిసియుండలేదు. జీవకణముల కలయిక చేత ఒక బిడ్డ జన్మముగా పరిణమించు చర్యల రూపురేఖలు వారు రచించగలరు, కానీ ఆ బిడ్డ ఆవిర్భావము 'ఎలా' జరుగుతుందో వివరించుటకు వారు మొదలుపెట్టలేరని వైద్య శాస్త్రవేతలు ఒప్పుకుంటారు.*

*"గనుక ప్రాణం పోగానే, జీవమును పునరుద్ధరింపగలది, మానవునికి తెలిసిన ఏ అధికారముగాని, ఏ తెలివిగాని లేదా ఏ శక్తిగాని లేదు. ఒక ప్రక్క వ్యాధులను నిరోధించుటలోను వ్యాధులకు చికిత్స చేయుటలోను వైద్య శాస్త్రము పెద్ద పెద్ద అంగలు వేస్తూ ఎంతో అభివృద్ధి సాధించినన్నూ, జీవము మరియు మరణము గూర్చిన మౌలికమైన విషయాలకు వచ్చినప్పుడు, మరొక ప్రక్క దాని నిస్సహాయ పరిస్థితిని గమనించుట ఒక బోధనాత్మకమైన విషయమగుచున్నది. ఏ వైద్యుడైనను, వైద్య శాస్త్రవేత్తయైనను, జీవరసాయన శాస్త్రవేతయైనను లేదా వ్యాధి విజ్ఞాన శాస్త్రవేత్తయైనను, నేటి వరకు కూడ, మరణించినవారిని లేపుటకు లేదా మృత శరీరము లోనికి జీవమును పునచొప్పించుటకు సరిపడు సాధనమునుగాని సాధనోపాయమునుగాని ఉత్పత్తిచేయలేక పోయారు మరియు కనుకొనలేకపోయారు. ఈ విధంగా, క్రీస్తు మరణము సందర్భములో మృతులు లేపబడినారని మనము తెలిసికొనునప్పుడు, ఇది కేవలము లోకాతీతవాదమైనదని మనము తప్పనిసరిగా గుర్తించవలెను. అది దేవుని తక్షణ చర్యయై యుండినది, అంతకు తక్కువైనదేమీ కాదు."*[2]

సూచనలు

[1]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel* (Cincinnati, Ohio: The Standard Publishing, n.d.), 732. [2]Gordon H. Girod, *Words and Wonders of the Cross* (Grand Rapids, Mich.: Baker Book House, 1962), 145-146.